





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 6 పేజీలు : 4+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి బుధవారం 11 సెప్టెంబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## గణనాథుడి అనుగ్రహంతోనే మళ్లీ హైదరాబాద్ సీపీగా వచ్చా



**హైదరాబాద్ పెన్ పవర్:**గణేష్ చతుర్థి రోజే హైదరాబాద్ సీపీగా తిరిగి రావడం సంతోషంగా ఉందని.. గణనాథుడి అనుగ్రహంతోనే నేను మళ్ళీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా వచ్చానని అనుకుంటున్నానని సీపీ సీవీ ఆనంద్ అన్నారు. హైదరాబాద్ సీపీగా మళ్ళీ తిరిగి వస్తానని అనుకోలేదన్నారు. మంగళవారం ఖైరతాబాద్ వినాయకుడిని సీపీ సీవీ ఆనంద్ దర్శించుకున్నారు. సీపీకి పూర్ణ కుంభంతోఅర్చకులు, ఉత్సవ సమితి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద సీవీ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా

వివరాలు 2లో..

## ఈ నెల 16న ఢిల్లీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



- సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు హస్తిన వెళ్లే అవకాశం
- మంత్రివర్గ విస్తరణపై ప్రధానంగా చర్చించే అవకాశం
- సామాజిక సమీకరణాల నేపథ్యంలో వాయిదా పడుతున్న విస్తరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నెల 16న ఆయన ఢిల్లీ పర్యటన ఖరారైంది. ఆయనతో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,

వివరాలు 2లో..

### ట్యాంక్ బండ్‌పై గణేష్ నిమజ్జనానికి

## హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

హుస్సేన్ సాగర్‌లో గణేశ్ నిమజ్జనంపై హైకోర్టు కీలక ఆదేశాలు




- సాగర్‌లో మట్టి, ఎకో ఫ్రెండ్లీ విగ్రహాలను నిమజ్జనం చేయవచ్చన్న హైకోర్టు
- పీవోపీ విగ్రహాలను మాత్రం తాత్కాలిక నీటి కుంటల్లో నిమజ్జనం చేయాలని ఆదేశాలు
- నిమజ్జనం విషయంలో 2021లో రూపొందించిన మార్గదర్శకాలనే పాటించాలని సూచన

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో గణేశ్ నిమజ్జనాలపై తెలంగాణ హైకోర్టు స్పష్టతను ఇచ్చింది. సాగర్‌లో మట్టి, ఎకో ఫ్రెండ్లీ విగ్రహాలను నిమజ్జనం చేయవచ్చని హైకోర్టు వెల్లడించింది. పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో తయారైన విగ్రహాలను మాత్రం జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక లేదా కృత్రిమ నీటికుంటల్లో నిమజ్జనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నిమజ్జనం విషయంలో 2021లో రూపొందించిన మార్గదర్శకాలనే పాటించాలని సూచించింది.హుస్సేన్ సాగర్‌లో గణేశ్ విగ్రహాల

వివరాలు 2లో..

# పన్ను ఆదాయంలో సగం ఇవ్వండి..

## సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్‌కు సీఎం, డిప్యూటీ సీఎం రిక్వెస్ట్

- తెలంగాణకు రుణభారమే పెద్ద సవాల్
- గత ప్రభుత్వం రూ.6.85 లక్షల కోట్ల అప్పు చేసింది
- సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉంది
- రైతు భరోసా, రుణమాఫీ జీవరేఖలాంటివి
- రుణాలు రీస్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలి
- సెస్, సర్ చార్జిల్లో రాష్ట్రాలకు వాటా కావాలి
- కేంద్రం కేటాయింపులు, రాష్ట్ర అవసరాలపై చర్చ




**హైదరాబాద్ పెన్ పవర్:**పన్ను ఆదాయంలో రాష్ట్రానికి సగం వాటా ఇవ్వాలని కేంద్ర ఆర్థిక సంఘాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రమని, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. అయితే భారీ రుణభారం సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్ లో సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ తో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ.. సంపద, ఆదాయం మధ్య పెద్ద అంతరం ఉందన్నారు. తెలంగాణకు గత ప్రభుత్వం చేసిన అప్పులే పెద్ద సవాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి తెలంగాణ రుణ భారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించడం భారంగా మారిందని చెప్పారు. రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలని, అదనపు ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41% నుంచి 50%కి పెంచాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉందని తెలిపారు. రైతుభరోసా, రైతు రుణమాఫీ తెలంగాణకు జీవరేఖ వంటివని అన్నారు. సెస్, సర్ చార్జిల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని అన్నారు. అన్ని రాష్ట్రాల తరపున ఈ డిమాండ్‌ను కమిషన్ ముందు ఉంచుతున్నట్టు చెప్పారు. ఈ డిమాండ్ ను నెరవేర్చితే.. దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ ఎంచుకున్న లక్ష్య సాధనకు మేం సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పారు. తెలంగాణను మేం ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని అన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహారులు కేకే, షబ్బీర్ అలీ, సీఎస్ శాంతి కుమారి, అధికారులు పాల్గొన్నారు.



## రూల్స్ ప్రకారమే పీఏసీ చైర్మన్ నియామకం..

అరికెపూడికి ఆ పదవి ఎలా ఇస్తారన్న ప్రశాంత్ రెడ్డి... మీ మధ్య విభేదాలతో మాకేం సంబంధమన్న శ్రీధర్ బాబు

- పీఏసీ చైర్మన్ పదవి మొదటి నుంచి ప్రతిపక్షానికి ఇవ్వడం ఆనవాయతీ అన్న బీఆర్ఎస్
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఎలా ఇస్తారని ప్రశ్న
- శాసనసభ నియామల ప్రకారమే పదవి ఇచ్చామన్న శ్రీధర్ బాబు
- చైర్మన్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అభిప్రాయభేదాలు ఉంటే తమకు సంబంధం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** పీఏసీ చైర్మన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించడంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ పదవిని ప్రతిపక్షానికి ఇచ్చే సంప్రదాయం మొదటి నుంచి వస్తోందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.

వివరాలు 2లో..

## ఉప్పల్ రైల్వే స్టేషన్ ను అప్ గ్రేడ్ చేయండి...

- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను ఢిల్లీలో కలిసిన..
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను అప్ గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి
- జమ్మికుంటలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ఆగేలా చూడాలన్న బండి సంజయ్
- ఆయా రైల్వే స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని విజ్ఞప్తి

వివరాలు 2లో..




## భద్రాచలం వద్ద 47 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

- 48 అడుగులకు చేరుకోగానే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్న అధికారులు
- నిన్న ఉదయం ఏడున్నరకు 43 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
- నిన్న ఉదయం మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసిన అధికారులు

వివరాలు 2లో..



**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం అంతకంతకు ఎక్కువవుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద ఉధృతి వేగంగా పెరుగుతోంది. దీంతో భద్రాచలం వద్ద నీటిమట్టం 47 అడుగులు దాటింది. సాయంత్రానికి 48 అడుగులకు చేరుకుంటుందని



### కొందరు ఏదో ఒక రూపంలో సాయం చేస్తున్నారు...

## వైసీపీ మాత్రం విషం చిమ్ముతోంది

బుడమేరు వద్దకు వెళ్లిన సీఎం చంద్రబాబు

గండ్లు పూడ్చిన ప్రదేశాల పరిశీలన

వైసీపీ ప్రజలపై కక్ష తీర్చుకోవాలన్నట్టు వ్యవహరిస్తోందని విమర్శలు

వివరాలు 2లో..

**హైదరాబాద్ పెన్ పవర్:**సీఎం చంద్రబాబు బుడమేరుకు గండ్లు పడిన ప్రాంతాలను నేడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్వాకాల వల్లే బుడమేరుకు గండ్లు పడ్డాయని విమర్శించారు. బుడమేరు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేశారని, అందువల్లే వరదలు ముంచెత్తాయని అన్నారు.

## త్వరలోనే 'ఆపరేషన్ బుడమేరు' చేపడుతున్నాం

- బుడమేరులోని ఆక్రమణలు తొలగిస్తామన్న నారాయణ
- వరద బాధితులకు ఆహారం, తాగునీరు లోటు లేకుండా చూశామని వెల్లడి
- 77 వేల విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించామన్న మంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:**విజయవాడను ముంచెత్తిన బుడమేరు లో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. త్వరలోనే 'ఆపరేషన్ బుడమేరు' చేపడుతున్నామని... ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని వెల్లడించారు. విజయవాడ వరద బాధితులకు ఆహారం, తాగునీరు పంపిణీలో ఎలాంటి లోటు లేకుండా చూశామని చెప్పారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పారిశుద్ధ్యం విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని నారాయణ తెలిపారు. ఇప్పటి వరకు 77 వేల విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించామని చెప్పారు. కలుషితమయ్యే




వివరాలు 2లో..

## ప్రకాశం బ్యారేజిని కూల్చి లక్ష మందికి పైగా ప్రజలను చంపాలనేదే జగన్ లక్ష్యం



- ఇటీవల ప్రకాశం బ్యారేజి గేట్లను ఢీకొట్టిన బోట్లు
- గతంలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోవడానికి కారణమయ్యారన్న లోకేశ్
- ఇప్పుడు మరో కుట్ర పన్నారని వెల్లడి
- ప్లాన్ జగన్ ది... అమలు చేసింది తలశిల, నందిగం అని వివరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రకాశం బ్యారేజి గేట్లను బోట్లు ఢీకొట్టిన ఘటన పూర్తిగా రాజకీయ రంగు పులుము కుంది. ఈ బోట్లను వైసీపీ వాళ్లే కుట్రపూరితంగా వదిలారని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# సైబర్ నేరాలకు రోజుకు 14 కోట్లు మాయం..?

దేశంలో సైబర్ నేరాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. ఈ జీ మనీ కోసం కేటుగాళ్లు కాసుకొని కూర్చుంటున్నారు. ప్రతి ప్లాన్ కు వాళ్లదగ్గర వేరే ప్లాన్ రెడీగా ఉంది. సైబర్ నేరాలతో మనం ఎప్పుడు జాగ్రత్త గానే ఉండాలి. ఎవరో తెలీకుండా పిన్ నెంబర్స్ కాని డీటైల్స్ కాని ఇవ్వకూడదు. సైబర్ మోసాల ద్వారా నేరగాళ్లు రోజుకు సుమారు 14 కోట్ల రూపాయలను అమాయకుల నుంచి కొల్లగొడుతున్నారు. అంటే ఏడాదికి సుమారు రూ.5వేల కోట్లను వివిధ పద్ధతుల్లో దోచుకుంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం గత జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు నాలుగు నెలల్లో రూ.1,770 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. గడిచిన ఐదేండ్లలో, ఈ ఏడాది ఏప్రిల్ చివరి నాటికి సుమారు 40 లక్షల సైబర్ నేరాలు నమోదయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు రూ. 8.6 కోట్లు మోసపోయిన సంఘటన మరువక ముందే హైదరాబాద్‌లో మరో భారీ మోసం బయటపడింది. సైబర్ నేరస్థులు ఓ వృద్ధుడి నుంచి ఏకంగా రూ.13.26 కోట్లను కొల్లగొట్టారు. ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ చిట్కాల పేరిట వచ్చిన మెసేజ్ నమ్మి పెట్టుబడి పెట్టి చివరకు మోసపోయాడు. షేర్లలో పెట్టుబడికి మొదట లాభాలు చూపించిన మోసగాళ్లు. వాటిని ఉపసంహరించుకోడానికి అవకాశం కల్పించారు. బాధితుడు సైబర్ నేరస్థులను పూర్తిగా నమ్మి ఏకంగా రూ.13.26 కోట్లను బదిలీ చేశాడు. ఆ తరువాత ఈ మోసాన్ని గ్రహించాడు. ఇదంతా కొంతమంది వ్యక్తుల కుమ్మక్కుతో ఒక నెట్‌వర్క్‌లా జరిగింది. యూపీఐ మోసాలతో ఇప్పటి వరకు రూ.4 కోట్లు కొల్లగొట్టిన రాజస్థాన్ సైబర్ కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక వీళ్లంతా హైదరాబాద్ లో ముఠాగా ఏర్పడి బజాజ్ ఎలక్ట్రానిక్స్‌ను టార్గెట్ గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నట్లు తాజాగా సైబరాబాద్ డీసీపీ నరసింహ తెలిపారు. ఇకపోతే ఈ ముఠాలో మొత్తం 13 మంది నిందితులు ఉన్నారని, పైగా ఒక్కొక్కరి దగ్గర రూ.1.72 లక్షల నగదు, 50 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. మొదట ఏదైనా ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసేందుకు నగరంలో పలు షోరూంలోకి వెళ్తున్నారు. ఇక అక్కడ విలువైన వస్తువులు కొనుగోలు చేశాక, యూపీఐ ద్వారా అమౌంట్ పే చేయడానికి బజాజ్ షోరూమ్ లో క్యూఆర్ కోడ్ ను వాళ్ల గ్యాంగ్ లో చాలా మందికి పంపుతూ ఆ అమౌంట్ ను రిటర్న్ తీసుకుంటున్నారు . ఈ క్రమంలోనే.. ఎలక్ట్రానిక్ వస్తువులు డెలివరీ అయ్యాక.. పొరపాటున వేరే ఖాతాకు ఖాతాకు డబ్బు బదిలీ చేశామంటూ తెలివిగా బ్యాంకుకు ఆశ్రయిస్తున్నారు. అలా చార్జ్ బ్యాక్ ఆప్షన్ ద్వారా తిరిగి డబ్బు పొందుతూ మోసాలకు పాల్పడుతున్నారు. యూపీఐ నుంచి డబ్బు రిటర్న్ రాగానే ...కొన్న కొత్త వస్తువును అమ్మేసి డబ్బు చేసుకుంటున్నారు. ఇలా గత రెండు నెలలుగా ఈ ముఠా 1,125 యూపీఐ ట్రాన్సయాక్షన్స్ చేశారన్నారు. అయితే ఎంత జాగ్రత్త గా ఉన్నా..ఇలాంటి టెక్నికల్ మోసాలను ఆపలేకపోతున్నామంటున్నారు అధికారులు. అసోంలో భారీ ఆర్థిక కుంభకోణం జరిగింది. డిబ్రూఘర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు జల్సాలకు బానిసై ఈజీగా డబ్బు సంపాదించుకోడానికి అడ్డదారులు తొక్కారు. ట్రేడింగ్ స్కాం చేయాలని పథకం పన్నారు. 60 రోజుల్లోగా తమ పెట్టుబడులపై 30శాతం రాబడికి హామీ ఇస్తూ పెట్టుబడిదారులను ప్రలోభపెట్టారు. అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లోని ప్రజల నుంచి రూ. 2,200 కోట్లు కాజేశారు. ఈ డబ్బుతో ఫార్మాస్యూటికల్స్, ప్రొడక్షన్, కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో ఒకరు పెట్టుబడి పెట్టగా, మరొకరు అస్సామీ సినిమాల్లో పెట్టుబడి పెట్టి విలాసవంతమైన జీవితాలను గడిపారుచివరకు పోలీస్‌లకు చిక్కారు. ఇలాంటి సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట బయటపడుతున్నాయి. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ మొబైల్ ఫోన్ అందుబాటులోకి రావడంతో సోషల్ మీడియాను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇంటర్నెట్‌లో ముఖ్యమంత్రులు, మంత్రు లు, ప్రముఖుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి డబ్బులు గుంజుతున్నారు. చాలావరకు ఈ నేరాలు సామాజిక మాధ్యమాల ద్వారానే జరుగుతుంటాయి. సోషల్ మీడియాలో ఏర్పడిన పరిచయాలు, కొన్ని ప్రకటనల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. సులువుగా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చన్న దురాశే ఈ నేరాలకు దారి తీస్తోంది. సాధారణంగా మనకు తెలియని విషయం ఏదైనా ఉందంటే దానిపై ఆసక్తితో తెలిసిన వారి సూచనలు తీసుకుంటాం. ముఖ్యంగా పెట్టుబడి వంటి ఆర్థిక సంబంధిత విషయాలైతే కచ్చితంగా అనుభవం ఉన్న వారి సలహాలు తీసుకుంటాం. ఈ పరిస్థితినే సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మనకు పెట్టుబడుల్లో సాయం చేస్తున్నట్టు నటించి మన సొమ్ము కాజేస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఉచిత స్టాక్ చిట్కాలు, సలహాలపై ప్రకటనలు విడుదల చేసి పెట్టుబడిదారులను ఆకర్షిస్తుంటారు. వివిధ క్లయింట్లు సంపాదించిన లాభాల తాలూకు నకిలీ స్క్రీన్ షాట్‌లను విడుదల చేసి నమ్మిస్తుంటారు. పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి ఆకర్షితులైతే ఆపరేటర్లు మొదట్లో డబ్బును మోసపూరిత వ్యక్తి తాలూకు బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారు. ఈ విధంగా నమ్మించి తమ ప్రీమియం, విఐపి ఛానెళ్లకు సభ్యత్వాన్ని పొందాలని ఒత్తిడి చేస్తారు. తద్వారా మరిన్ని ఎక్కువ లాభాలు వస్తాయని హామీ ఇస్తుంటారు. బాధితులు ఒకసారి ప్రలోభాలకు గురైన తరువాత వారి బ్యాంకు ఖాతాల్లోకి పెద్ద మొత్తంలో నిధులను బదిలీ చేయాలని అడుగుతుంటారు. వెబ్‌సైట్‌లో ప్రదర్శించే నకిలీ లాభాలను ఉపసంహరించుకోడానికి పెట్టుబడిదారులు ప్రయత్నించినప్పుడు, ఉపసంహరణ ఎంపిక బ్లాక్ చేయడంతో వారు షాక్‌కు గురవుతారు. ఎంపికను అన్‌బ్లాక్ చేయడానికి స్కామ్‌స్టర్లు పన్నులు, పెనాల్టీలతో సహా వివిధ కారణాలను పేర్కొంటూ తదుపరి డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి చేస్తారు. భారీగా మొత్తాన్ని సేకరించిన తరువాత స్కామ్‌స్టర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోతుంటారు. సైబర్ నేరగాళ్లు బెదిరింపులు కూడా చేస్తుంటారు. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మీ బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అయిందని, ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని, వాట్సాప్‌లో హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఆ నేరంతో తనకెలాంటి సంబంధం లేదని చెప్పినా వినకుండా అదే పనిగా బెదిరిస్తుంటారు. తాజాగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ పేరునే ఉపయోగించి తాను సిజెఐని అని క్యాబ్ కోసం తనకు రూ. 500 పంపాలని హెచ్చరిస్తూ మెసేజ్ కూడా వచ్చింది. ఈ విధంగా వివిధ రకాలుగా ఈ ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ నేరాలు సాగుతున్నాయి. ఇలాంటి కేసులు పెరిగిపోతుండడంతో హైదరాబాద్‌లోని క్రైమ్స్ అండ్ సిట్ అధికారులు కొన్ని హెచ్చరికలను చేశారు. మార్కెట్ రెగ్యులేటరీ సెబీలో రిజిస్టర్ చేసినవి కాకుండా తెలియని అప్లికేషన్లలో స్టాక్ మార్కెట్ చేయవద్దు. అలాగే అవతలి వ్యక్తుల మాటలను నమ్మి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు డబ్బును బదిలీ చేయరాదు. మోసగాళ్లు అందించే సందేహాస్పదమైన రాబడిని నమ్మవద్దు. మీ డిమ్యాట్ ఖాతా ఆధారాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దు. గూగుల్ ప్లేస్టోర్ లేదా వారి స్వంత వెబ్‌సైట్‌ల నుండి డౌన్‌లోడ్ చేసేటప్పుడు అప్లికేషన్ల ప్రామాణికత నిర్ధారించుకోవాలి' అని క్రైమ్ విభాగం హెచ్చరికలు చేసింది. ఈ విషయంలో సెబీ యంత్రాంగం ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం చాలా అవసరం.

# ఉప్పల్ రైల్వే స్టేషన్ ను అప్ గ్రేడ్ చేయండి...

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప్పల్ రైల్వేస్టేషన్‌ను అప్ గ్రేడ్ చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కేంద్రమంత్రి బండి సంజయ్ కోరారు. ఢిల్లీలో రైల్వే మంత్రిని కలిసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు వినతి పత్రం సమర్పించారు. కరీంనగర్ నుండి హసన్ పర్తి వరకు 61.8 కి.మీల మేరకు నిర్మించే కొత్త రైల్వే లేన్ కు రూ.1415 కోట్లు వ్యయం అవుతుందని, ఈ మేరకు డీపీఆర్ కూడా సిద్ధమైందని తెలిపారు. రైల్వే బోర్డులో ఈ అంశం పెండింగ్ లో ఉందని, తక్షణమే ఆమోదం తెలపాలని కోరారు. కొత్త రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, కరీంనగర్ %-% వరంగల్ మధ్య వాణిజ్య కనెక్టివిటీ పెరిగి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ రైల్వే స్టేషన్ ను అప్ గ్రేడ్ చేయాలని.. అలాగే జమ్మికుంట స్టేషన్ వద్ద దక్షిణ ఎక్స్ ప్రెస్ రైలు ఆగేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ రైల్వే మంత్రికి బండి సంజయ్ మరో లేఖ అందజేశారు. ఉప్పల్ స్టేషన్ అప్ గ్రేడ్ లో భాగంగా ప్లాట్ ఫాం, రైల్వే స్టేషన్ భవనాన్ని ఆధునీకరించాలని ... కొత్త రైల్వే సేవలను ప్రవేశపెట్టాలని కోరారు. ప్రయాణీకుల రాకపోకలకు సంబంధించిన సౌకర్యాలను మెరుగుపర్చాలని... పార్కింగ్ ను విస్తరించాలని, సోలార్ ప్యానెళ్లను అమర్చాలని, టిక్కెట్ కౌంటర్, లగేజీ నిర్వహణ వ్యవస్థను మెరుగుపర్చాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రజలకు ఎంతో మేలు కలిగించే ఉప్పల్ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు సంబంధించి నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రకాశం బ్యారేజిని కూల్చి లక్ష మందికి పైగా ప్రజలను చంపాలనేదే జగన్ లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం బ్యారేజిని కూల్చి లక్ష మందికి పైగా ప్రజలను చంపాలనేది జగన్ లక్ష్యమని ఆరోపించారు. "గత ప్రభుత్వ హయాంలో సైకో జగన్ తన ఇసుక మాఫియా కోసం అన్నమయ్య డ్యామ్ ను కొట్టుకుపోయేలా చేసి ప్రాణ నష్టానికి కారణమయ్యారు. 50 మందిని చంపేసి, ఐదు గ్రామాలను నామరూపాల్లేకుండా చేశారు. ఇప్పుడు ప్రకాశం బ్యారేజిని ఇనుప పడవలతో ఢీకొట్టి కూల్చాలన్ని కుట్ర చేశారు.

విజయవాడతో పాటు పదుల సంఖ్యలో లంక గ్రామాలను నామరూపాల్లేకుండా చేయాలన్న సైకో జగన్ కుట్ర బయటపడింది. ప్రజలను జలసమాధి చేయాలన్న కుట్రకు ప్లాన్ చేసింది సైకో జగన్ అయితే... ఆ ప్రణాళికను అమలు చేసింది తలశిల రఘురాం, నందిగం సురేశ్" అంటూ నారా లోకేశ్ వివరించారు. తమ కుట్రలు బయటపడకుండా... వరద ముంపునకు కారణం ప్రభుత్వమే అంటూ సైకో జగన్ ముఠా విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

# గణనాథుడి అనుగ్రహంతోనే మళ్లీ హైదరాబాద్ సీపీగా వచ్చా

- మొదటి పేజి తరువాయి

ఆయన మాట్లాడుతూ.. నేను డీసీపీగా ఉన్నప్పటి నుండి ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక ఉత్సవాలను పూర్తి చేశామని గుర్తు చేశారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం గత ఏడాదిలాగే ఈసారి కూడా మధ్యాహ్నం లోపే పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం చూసేందుకు లక్షలాది మంది వస్తారన్న సీపీ.. ఈ మేరకు ట్రాఫిక్‌ను సమన్వయం చేస్తూ బందోబస్తు పెంచుతామని తెలిపారు.

మర్దనం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామని.. ప్రశాంతంగా గణనాథుడి శోభాయాత్ర ముగిసేలా కట్టుదిట్టమైన భద్రతా ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, గతంలో హైదరాబాద్ సీపీగా పని చేసిన సీవీ ఆనంద్‌ను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈసీ బదిలీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం సీవీ ఆనంద్‌ను ఏసీబీ డీజీగా నియమించింది. అయితే, ఈ నెల 7వ తేదీన (వినాయక చవితి) తిరిగి హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం అపాయింట్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఖైరతాబాద్ బడా గణపతి శోభాయాత్రకు బందోబస్తు ఏర్పాట్లపై సీవీ ఆనంద్ దృష్టి పెట్టారు.

# రూల్స్ ప్రకారమే పీఏసీ చైర్మన్ నియామకం..

- మొదటి పేజి తరువాయి

కానీ, అధికార పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఈ పదవిని ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ లోపాలను ప్రతిపక్షాలు ఎత్తిచూపకుండా ఉండేందుకే అరికెపూడికి ఈ పదవిని కట్టబెట్టారని ఆరోపించారు. తమ పార్టీ నేత హరీశ్ రావు ఈ పదవి కోసం నామినేషన్ వేస్తే తిరస్కరించారని మండిపడ్డారు. పీఏసీ చైర్మన్ పదవి కోసం నాలుగు నామినేషన్లు వచ్చినప్పటికీ ఎన్నికలు ఎందుకు జరపలేదో చెప్పాలని నిలదీశారు. అరికెపూడి గాంధీ కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం ప్రపంచానికి తెలుసని అన్నారు. మరలాంటప్పుడు... విపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన పదవిని ఆయనకు ఎలా ఇస్తారని మండిపడ్డారు. లోక్ సభలో విపక్ష కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్‌ను పీఏసీ చైర్మన్‌గా నియమించారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీలో ఒక రాజ్యాంగం... తెలంగాణలో మరో రాజ్యాంగం ఉందా? అని ప్రశ్నించారు. రాజ్యాంగ రక్షణ అని పదేపదే పలుకుతున్న రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని నిలదీశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని తాము ఇచ్చిన పిటిషన్ సభాపతి వద్ద ఉందని, పెండింగ్‌లో ఉన్నప్పుడు పదవి ఇవ్వడమేమిటన్నారు. పీఏసీలో హరీశ్ రావు ఉండాలనుకుంటే అధికార పార్టీ ఎందుకు భయపడుతుందో చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డివి శిఖండి రాజకీయాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మీ మధ్య అభిప్రాయభేదాలు ఉంటే మాకేం సంబంధం?**

పీఏసీ చైర్మన్ పదవిపై ప్రతిపక్షాల విమర్శలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. శాసనసభ నియమాల ప్రకారమే నియామకం జరిగిందని స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అని గాంధీ చెప్పారన్నారు. బీఆర్ఎస్ నేతలతో పీఏసీ చైర్మన్‌కు అభిప్రాయభేదాలు ఉంటే తమకు సంబంధం లేదన్నారు. ప్రభుత్వాన్ని నడపడమే తమ బాధ్యత అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో... ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు.

# భద్రాచలం వద్ద 47 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

- మొదటి పేజి తరువాయి

భావిస్తున్న అధికారులు... అప్పుడు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. ఈరోజు ఉదయం ఏడున్నర గంటలకు గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ క్రమంలో వరద నీరు పెరుగుతుండటంతో సాయంత్రానికే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే పరిస్థితి కనిపిస్తోంది. నిన్న ఉదయం నుంచి గోదావరి నీటిమట్టం 20 అడుగులకు పైగా పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద కారణంగా గోదావరి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం

ఉందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు వెల్లడించారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో పాటు దిగువ ప్రాంతంలో ఉన్న శబరి ఉపనది పోటెత్తడంతో ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ముంపు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

## ట్యాంక్ బండ్‌పై గణేష్ నిమజ్జనానికి

# హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

నిమజ్జనంపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్ కోర్టు ధిక్కార ఆధారాలు చూపలేకపోయారని తెలిపింది. నిమజ్జనం చివరి సమయంలో ధిక్కార పిటిషన్ సరికాదని హైకోర్టు పేర్కొంది. అలాగే, హైడ్రాను ప్రతివాదిగా చేర్చలేమని హైకోర్టు స్పష్టం చేసింది. గత ఆదేశాల సమయంలో హైడ్రా లేదని తెలిపింది. అలాంటప్పుడు ప్రతివాదిగా ఎలా చేర్చుతామని ప్రశ్నించింది. పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం విధించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేక ఆదేశాల కోసం అవసరమైతే పిటిషనర్ రిట్ దాఖలు చేయవచ్చునని సూచించింది.

# త్వరలోనే 'ఆపరేషన్ బుడమేరు' చేపడుతున్నాం

- మొదటి పేజి తరువాయి

అవకాశం ఉన్నందున, వరద ప్రాంతాల్లోని నీటిని మరో రెండు రోజుల వరకు తాగొద్దని ప్రజలకు సూచించామని తెలిపారు. వరద బాధితులు పూర్తిగా కోలుకునేంత వరకు ఆహారాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు.

# ఈ నెల 16న ఢిల్లీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- మొదటి పేజి తరువాయి

శ్రీధర్ బాబు కూడా వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

ఈ పర్యటనలో మంత్రివర్గ విస్తరణపై ప్రధానంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ కార్యవర్గ కూర్పు తదితర అంశాలపై పార్టీ అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉంది. పీసీసీ అధ్యక్ష పదవి, కేబినెట్ విస్తరణ వంటి అంశాలపై పార్టీ అధిష్ఠానం చాలా రోజులుగా కసరత్తు చేస్తోంది. ఇటీవలే అధ్యక్షుడిని నియమించారు. సామాజిక సమీకరణాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కేబినెట్ విస్తరణ వాయిదా పడుతూ వస్తోంది.

# కొందరు ఏదో ఒక రూపంలో సాయం చేస్తున్నారు... వైసీపీ మాత్రం విషం చిమ్ముతోంది

- మొదటి పేజి తరువాయి

ఐదేళ్ల దుర్మార్గమైన పాలన కారణంగా 6 లక్షల మంది జీవితాలు అస్తవ్యస్తమయ్యాయి. కాగా, విజయవాడ వరద బాధితులకు సాయం చేసేందుకు అనేకమంది ముందుకొస్తుండడం శుభపరిణామం అని చంద్రబాబు పేర్కొన్నారు. కొందరు ఆర్థిక రూపేణా సాయం చేస్తున్నారని, మరకొందరు ఆహారం అందిస్తున్నారని, ఇంకొందరు ఇతర రూపాల్లో సాయం అందిస్తున్నారని వివరించారు. కానీ వైసీపీ మాత్రం విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తమను ఓడించిన ప్రజలపై కక్ష తీర్చుకోవాలన్నట్టుగా వ్యవహరిస్తోందని, కృష్ణా నదికి వరద పోటెత్తుతున్న వేళ నదిలో మూడు పడవలు వదిలిపెట్టారని చంద్రబాబు ఆరోపించారు. ఈ పడవలు కౌంటర్ వెయిట్లకు తగిలాయి కాబట్టి సరిపోయిందని, అలాకాకుండా, బ్యారేజి కాలమ్ ను ఢీకొట్టి ఉంటే భారీ నష్టం జరిగి ఉండేదని వివరించారు. ఆ పడవలు వదిలిపెట్టిన వారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# ఆస్తి కోసం భర్త అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

**పెద్దపల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 10:** పెద్దపల్లి – మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన సునీల్ (36)కు నాలుగేళ్ల కింద సంధ్యతో వివాహమైంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. సునీల్, సంధ్య మధ్య గొడవలు జరగడంతో ఏడాది నుంచి ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా సునీల్ మూడు రోజుల క్రితం హైదరాబాద్లో చనిపోయాడు. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు అతడి కుటుంబ సభ్యులు మంథనిలోని గోదావరి ఒడ్డుకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సంధ్య కుటుంబ సభ్యులతో కలిసి మంథనికి చేరుకొని అంత్యక్రియలు అడ్డుకుంది. సునీల్ ఆస్తిలో తన కుమారుడికి వాటా ఇవ్వాలని పట్టుబట్టింది.

# కొయ్యూరు అడవుల అందాలు ఇవే..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎటు చూసినా దట్టమైన అడవి.. భూమికి ఆకుపచ్చని రంగేసినట్టే కనిపిస్తుంది. ఆ పక్కనే మానేరు పరవళ్లు.. చట్టూ ఎత్తైన కొండలు ఇన్ని ప్రకృతి అందాల మధ్య చారిత్రక వైభవాన్ని చాటిచెప్పే నైన గుహలు ...గుళ్లు. . వందల సంవత్సరాల నాటి ఈ గుహల గోడలపై ఉన్న అందమైన వర్ణచిత్రాలను ఎంతసేపు చూసినా తనివితీరదు. ఇలాంటి అద్భుతమైన ప్రదేశం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం కొయ్యూరుకు దగ్గరలో ఉంది. వీకెండ్లో సరదాగా కాసేపు గడపాలంటే మీరూ ఓ లుక్కేయండి

మానేరు నది తీరంలో మన చరిత్రను ఉన్నాయి. అవన్నీ పడమటి ముఖం కలిగి ఉన్నాయి. ఒకే రాతి గుట్టలని తొలిచి నాలుగు గుహలుగా మార్చారు. ప్రతి ఆలయం గర్భగుడి ముందు అర్ధ మండపాలు, ఇరువైపులా రెండు స్తంభాలు ఉన్నాయి, మొదటి గుహలో శివలింగం, రెండో గుహలో మహిషాసుర విగ్రహం. మూడోగుహలో లింగం, నాలుగో గుహలో వినాయకుడిని పోలిన విగ్రహం ఉన్నాయి. పాండవుల గుట్టలో మాదిరిగానే గోడ పైభాగంలో అందమైన పాలియోలిథిక్ వర్ణ చిత్రాలు కనిపిస్తాయి.

### చరిత్ర

ఇది సుమారు 10-11వ శతాబ్దాలకు చెందినవని పురావస్తు శాఖ తెలిపిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఈ గుహలు జైనుల వసతి గృహాలుగా ఉన్నాయి. అయితే వాటిని తర్వాత శివాలయాలుగా మార్పు చేసినట్లు తెలుస్తుంది. వీటిని కాకతీయ సామ్రాజ్యం తొలిదశలో నిర్మించినట్లు చరిత్రకారులు చెప్తున్నారు. క్రీ. శ. 11 వ శతాబ్దంలో ముత్ర కూటం (మంథని) రాజ్యాన్ని పాలిస్తున్న గుండ రాజు రాజైన సన్యాసులు ఉండేందుకు దీన్ని కట్టించాడని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఇది చాలాకాలంపాటు విడిది కేంద్రంగా విలసిల్లినట్లు చరిత్ర చెప్తుంది. ఈ గుహల పైభాగంలో నవని సున్నపు పొరలున్నాయి. వాటిపై రకరకాల వర్ణచిత్రాలు కనిపిస్తున్నాయి.

క్రీ.శ. 1138లో కాకతీయ ప్రభువైన రెండో పోలరాజు రాజ్య విస్తరణలో భాగంగా మంత్రకూటం రాజైన గుండరాజుపై దండెత్తాడు. ఈ భీకర యుద్ధంలో వేలాది మంది సైనికులకు గాయాలయ్యాయి. అదే టైంలో ఇక్కడున్న ప్రముఖ జైన ఆయుర్వేద వైద్యుడు అగ్గళయ్య సైనికులుకు వైద్యం చేసేందుకు ఈ గుహలను హాస్పటల్‌గా మార్చాడు. అప్పటి నుంచి చుట్టు గ్రామాల ప్రజలకు కూడా ఏ రోగమొచ్చినా ఇక్కడికే వచ్చే వాళ్లు. అందుకే వాటిని రోగాలను నయం చేసే గుళ్లుగా పిలిచేవాళ్లు. అదే వ్యవహారిక భాషలో "నైన గుళ్లు'గా మారింది. గహాలయాల గోడల మీద రెండు లఘు శాసనాలు తెలుగు భాషలో చెక్కిన రెండు చిన్న లేబుల్ శాసనాలున్నాయి.

గుహల గోడలపై ఉన్న వర్ణచిత్రాల్లో నర్తకియుద్ధ సన్నివేశాలు గుర్రపు రథాలు బాణం పట్టుకున్న సైనికులు, రాజభవనాలు ఇలా ఎన్నో ఉన్నాయి. ఈ చిత్రాలు పొరలు, కాలక్రమేణ ఊడిపోయి ప్రస్తుతం నలువు.. ఎరుపు, నీలం, పసుపు పచ్చని రంగుల్లో కనిపిస్తున్నాయి. కొన్ని అస్పష్టమైన గుర్తులుగా మిగిలాయి. గీసిన రాతి భాగం నాణ్యమైన శిల కాకపోవడం. శతాబ్దాల తరబడి మానేరు నది నుంచి వీచే గాలులకు ఈ చిత్రాలు వాటి రూపుని కోల్పోతున్నాయి. ఈ చిత్రాలు భూపాలపల్లి జిల్లా తిరుమలగిరి సమీపంలో పాండవులగుట్టలోని వర్ణచిత్రాల కంటే ప్రాచీనమైనవి. వాటి రంగుల గాఢత చిత్రించిన శైలి మనకు అజంతా చిత్రాలను గుర్తుకు తెస్తున్నాయి.

### ఎండాకాలంలో కూడా ఇక్కడ నీరు ఎండిపోదు..

నైనగుళ్లలో మహాశివరాత్రి, శ్రీరామనవమి వేడుకలను అంగరంగవైభవంగా వేస్తారు. ఇక్కడ మరో ప్రత్యేకత ఏంటంటే. ఈ గుహాలయం పక్కన మానేరు నదిలో మండు వేసవిలో కూడా ఎండిపోని పెద్ద మడుగులు ఉన్నాయి. ఇంతటి అపురూపమైన చరిత్ర కలిగిన నైనగుళ్లను ఫారెస్టు అధికారులు, పురావస్తు పరిశోధకులు అనేకసార్లు పరిశీలించి అప్పటి జిల్లా కలెక్టర్ అనయ్ కుమార్ కు నివేదిక అందించారు. జిల్లా కలెక్టర్, పారెస్టు అధికారులు.. పురావస్తుశాఖ అధికారులు నైనగుళ్లలో టూరిస్టుల కోసం దారి ఏర్పాటు చేసి, కరంట్, తాగునీరు వంటి మౌలిక వసతులను కల్పిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

### పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి..

అతిపురాతనమైన చారిత్రక సాంస్కృతిక వారసత్వ సువలైన వైనగుర్లను ప్రభుత్వం, పురావస్తుశాఖ పరిరక్షించాలి. ఇంతటి చారిత్రక పురావస్తుశాఖ ప్రచారం చేయాలి. మానేరులో బోటింగ్ బూస్టులు ఏర్పాటు చేస్తే తెలంగాణలో మరో పర్యాటక కేంద్రం రూపుదిద్దుకునే అవకాశం ఉంది.

# జ్ఞానదంతం తీసేస్తే ఏమవుతుందో తెలుసా..



**హైదరాబాద్ పెన్ పవర్:** పళ్ల తీపి చేసినా.. చిగురు వాపు వచ్చినా, వాచినా 'ఏం కాదులే' అని లైట్ తీసుకుంటారు చాలామంది. కానీ, శరీరంలో వచ్చే చాలా మార్పులు ముందుగా బయటపడేది నోట్లోనే! నోరు పొడిబారితే ఏమవుతుంది? జ్ఞానదంతం తీసేస్తే ఏం అవుతుంది. తినేటప్పుడు ఏమైనా ఇబ్బందులు వస్తాయా.. ఆరోగ్య నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం. . .

పది సంవత్సరాలు వయస్సు ఉన్నవారికివెనక దవడ పళ్లు వస్తున్నప్పుడు అక్కడ చిగురు వాస్తే... తినేటప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుంది. పాల పళ్లు ఊడి, పర్మినెంట్ పళ్లు వచ్చేటప్పుడు చిగురు వాస్తుంది . కింద పన్ను బయటకు వస్తుందా? లేదా? అని తెలుసుకోవాలంటే ఎక్స్ రే తీసి నిర్ధారించుకోవాలి. అది చక్కగానే వస్తున్నట్లయితే.. ఈ చిగుర్ల మీద లిగ్నోక్లెయిన్ ఆయింట్ మెంట్ గానీ, బెంజోకెయిన్ ఆయింట్ మెంట్ గానీ తినేముందు పూస్తే.. నొప్పి నుంచి ఉపశమనం పొందొచ్చు. అలాకాకుండా ఒకవేళ చిగురు గట్టిపడి. పన్ను బయటకు రాలేకపోతే దానికి ఒవర్ క్లక్' అనే ఒక చిన్న పద్ధతి ద్వారా క్లియర్ చేయొచ్చు. లోపల ఉన్న పన్ను తీరుని బట్టి చికిత్స చేయించుకోవాలి. పన్ను బయటకు వచ్చిన తర్వాత చిగురు మీద ఆహారం ఒత్తిడి పడదు. కాబట్టి. నొప్పి తగ్గిపోతుంది.

ఇక సాధారణంగా పద్దెనిమిది నుంచి ఇరవై ఒక్క సంవత్సరాల మధ్యలో జ్ఞాన దంతాలు బయటకు రావడం ప్రారంభమవుతాయి. ఇవిబయటకు వచ్చేటప్పుడు చిగురు లోపల ఇరుక్కున్నప్పుడు వంకరగా వస్తుంటాయి. ఒక్కోసారిసగం మాత్రమే వచ్చి ఆగిపోతాయి. ఈ పళ్లను ఇంపాక్టెడ్ టీవ్ అంటారు. ఇలా వంకర తిరిగిన, ఇరుక్కున్న పళ్ల దగ్గర ఆహారం చేరినప్పుడు చిగురు వాస్తుంది. ఇదే దవడ దగ్గర నొప్పికి కారణమువుతుంది. మందులు తీసుకున్నప్పుడు ఈ నొప్పి తగ్గినట్టు అనిపిస్తుంది. కానీ, అది తాత్కాలికమే అని గుర్తించాలి.

ఇలాంటప్పుడు చిగురుని తొలగించాల్సి వస్తుంది. పన్ను పొజిషన్ వంకరగా ఉండే ముందు పన్నుపై ఒత్తిడి పడినప్పుడు జ్ఞాన దంతాన్ని తొలగించాలి. తొలగించిన తర్వాత కృత్రిమ పళ్లు పెట్టించుకోవాల్సిన అవసరం కూడా లేదు. స్కాన్, ఎక్స్ రేలో జ్ఞాన దంతాల పొజిషన్ తెలుసుకుని.. డాక్టర్లు జ్ఞానదంతాల్ని తొలగిస్తారు లేదా పన్ను చక్కగా ఉంటే, చిగురిని తొలగించి దానికి ఒక దారిని క్రియేట్ చేస్తారు.

జ్ఞాన దంతం, చిగురు మధ్య ఆహారం ఇరుక్కుంటోంది. జ్ఞాన దంతం అనే కాదు.. పన్నుకు... చిగురుకి మధ్య ఎక్కడా ఆహారం నిల్వ ఉండకూడదు. జ్ఞాన దంతానికి, దాని ముందు పన్నుకు మధ్య ఆహారం ఉన్నప్పుడు జ్ఞానదంతంతోపాటు అది పుచ్చిపోయే అవకాశం ఉంటుంది. ఆ పుచ్చు లోపలి నుంచి మొదలవుతుంది. కంటికి కనిపించదు. నొప్పి వచ్చినప్పుడు మాత్రమే సమస్య తెలుస్తుంది. నొప్పి రాగానే.. దంత వైద్యుడిని కలవాలి.

ఇంకా నోటిలో వచ్చే మరొక సమస్య ఏంటంటే.. ఇన్ఫెక్షన్స్ లేదా దురలవాట్ల వల్ల కండరాలు అన్నీ గట్టిగా బిగుసుకు పోతాయి. దీన్నే 'ఓరల్ రబ్ న్యూకోస్ ఫైబ్రోసిస్ అంటారు. ఈ సమస్యలు ఉన్నప్పుడు నోరు తెరిచేందుకు ఇబ్బంది పడుతుంటారు. కింది దవడ, పై దవడ అతుక్కొని ఉన్న జంక్షన్ దగ్గర ఉండే జాయింట్ల వద్ద వచ్చిన మార్పుల వల్ల కూడా ఒక్కోసారి నోరు తెరవలేకపోతారు. ఇవన్నీ చెక్ చేసుకున్న తర్వాత ట్రీట్ మెంట్ తీసుకోవాలి.

ఒక్కోసారి నోరు పొడిబారినట్టు అనిపిస్తుంటుంది. అలాంటప్పుడు తినేటప్పుడు తేలికగా మింగలేకపోతారు. మాట్లాడేటప్పుడు నాలుక పొడిగా ఉండటం వల్ల. మాటలు కూడా స్పష్టంగా రావు. ఇలాంటి సమస్యలకు చాలా కారణాలు ఉన్నాయని దంత నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా డయాబెటిస్ వల్ల, కొన్ని రకాల మందులు వాడటం, నోటితో గాలి పీల్చుకోవడం, కొన్ని రకాల సింద్రోమ్స్ .. క్యాన్సర్ ట్రీట్ మెంట్ తర్వాత వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ వల్ల నోరు ఆరిపోయి పొడిబారుతుంది.

ఈ సమయంలో లాలాజలం ఉత్పత్తి తగ్గిపోతుంది. చాలాజలం ఉత్పత్తితగ్గిపోయినప్పుడు తింటున్న ఆహారం పళ్ల చుట్టూ చేరి వెంటనే గట్టిపడటం పళ్లకి చిగురికి మధ్య చేరిపోతుంది. అది పళ్ల మధ్య చాలా కాలంఅతుక్కొని ఉంటుంది. దీనివల్ల చిగురు వ్యాధులురావడంతో పాటు పిప్పి పళ్లు కూడా తొందరగావస్తుంటాయి. నోరు పొడిబారడానికి కారణంతెలుసుకొని చికిత్స తీసుకోవాలి. అయితే,నోరు పొడిబారకుండా కొన్ని చిట్కాలు కూడా ఉన్నాయి.

నీళ్ల బాటిల్ దగ్గరపెట్టుకుని కొంచెం కొంచెం తాగుతూ ఎప్పుడూ నోటిని తడుపుకుంటూ ఉండాలి

షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్స్‌ని సమలడం వల్ల కూడా లాలాజలం ఉత్పత్తి పెరుగుతుంది.

స్మోకింగ్, ఆల్కహాల్‌కి దూరంగా ఉండటం వల్ల కూడా నోటి పొడిని తగ్గించుకోవచ్చు.

'అర్టిఫిషియల్ సలైవర్ సబ్ స్టిట్యూట్స్" అని మెడికల్ షాప్ లో దొరుకుతాయి. ఈ లిక్విడ్స్ నోట్లో పూసుకున్నప్పుడు నోరు తడిగా మారుతుంది.

అరిపోయినా పట్టించుకోకపోవడం వల్ల నోరు పగలడం, కారం తిన్నప్పుడు మండటం... మాటల్లో స్పష్టత లేకపోవడం, తినేటప్పుడుమింగలేకపోవడం వంటివి జరుగుతాయి. కొంతమంది నిద్రలో పళ్లు కొరకడం, పళ్ల అరుగుదల... తినేటప్పుడు పళ్లు వందర టింకరగా మ్యాచ్ కావడం వల్ల కూడా ఈ సమస్యలు వస్తాయి. జాయింట్ల దగ్గర ఇన్ఫెక్షన్స్ జాయింట్లు అరిగిపోయి బోన్ చేంజెస్ రావడం వల్ల దవడని కదిలించలేక ఇబ్బంది పడతారు.

## ట్యాంక్ బండ్‌పై గణేష్ నిమజ్జనం లేదా.. మరి ఎక్కడ?



**హైదరాబాద్ పెన్ పవర్:** గణేష్ నవరాత్రుల్లో భాగంగా విగ్రహాల నిమజ్జనంపై రాష్ట్ర హైకోర్టు పోలీస్ డిపార్ట్ మెంట్ కు కీలక ఆదేశాలు జారీ చేసింది. హుస్సేన్ సాగర్‌లో పీవోపీ విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు నిషేధం విధించింది. దీంతో సెప్టెంబర్ 16 (సోమవారం) హైదరాబాద్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనం ట్యాంక్ బండ్ పై చేయవద్దని తెలంగాణ పోలీసులు ప్రకటించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలను వివరిస్తూ పోలీసులు ట్యాంక్ బండ్ పై విగ్రహాలు నిమజ్జనం చేయడాన్ని నిషేదించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) సిటీ అంతటా గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం పర్యావరణానికి అనుకూలమైన ఏర్పాట్లు చేసింది. విగ్రహాల నిమజ్జనం కోసం హైదరాబాద్‌లో పోర్టబుల్ చెరువులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని వివిధ జోన్లలో విగ్రహాల సైజును బట్టి జీహెచ్ఎంసీ 73 పోర్టబుల్ ఇమ్మర్షన్ చెరువులను ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్, పీవీ మార్గ్ నెక్లెస్ రోడ్లపై అధికారులు నిమజ్జనానికి భారీ క్రేన్‌లను ఏర్పాటు చేశారు.

## ఈ-ట్రాక్టర్ వస్తోంది.. కిలో మీటర్‌కు రూ.14లే ఖర్చు, 3గంటలే ఛార్జింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇప్పటి వరకు మీరు ఎలక్ట్రికల్ కారు చూసుంటారు, ఎలక్ట్రికల్ బైక్ చూసుంటారు.. కానీ ఎలక్ట్రికల్ ట్రాక్టర్ ఎప్పుడైనా చూశారా? ఈ-ట్రాక్టర్ వస్తే ఇండియా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయి. ఇండియా జనాభాలో దాదాపు 60 శాతం మంది వ్యవసాయం రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

ఇప్పుడిప్పుడే రైతులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. అయితే వ్యవసాయంలో రైతన్నకు చేదోడు వాదోడుగా ఉండే ట్రాక్టర్ పై ప్రయోగాలు జరుగున్నాయి. ట్రాక్టర్ మెయిన్ టెనెన్స్ ఖర్చు తగ్గించే దిశగా ఎలక్ట్రానిక్ ట్రాక్టర్ తీసుకురావాలని కుబోటా, మహీంద్రా, HAV, సోనాలికా ట్రాక్టర్ కంపెనీలు ఎలక్ట్రానిక్ ట్రాక్టర్ నమోనా చూపించాయి. AutoNxt స్టార్టప్ కంపెనీ ఎలక్ట్రికల్ ట్రాక్టర్ టెక్నాలజీపై పని చేస్తోంది. AutoNxt కంపెనీ ఈ ట్రాక్టర్ కోసం లెవల్ 3 అటానమస్ టెక్నాలజీ వాడుతున్నట్లు సీఈఓ చెప్పారు. డ్రైవర్ లెస్ ట్రాక్టర్ టెక్నాలజీ కూడా ఈ కంపెనీలో వచ్చే ఏడాది లోపు వస్తుందని సీఈఓ కౌస్తుభ్ ధోండే చెప్పారు. డీజిల్ ట్రాక్టర్ కంటే ఈ ట్రాక్టర్ తక్కువ మెయిన్ టెనెన్స్ ఉంటుందని ధోండే అన్నారు. డీజిల్ ట్రాక్టర్ కిలో మిటర్ కు రూ.93లు ఖర్చు అయితే.. ఈ ట్రాక్టర్ రూ.14 లు మాత్రమే ఖర్చు వస్తుందని ఆయన తెలిపారు. డీజిల్ ట్రాక్టర్ల కంటే ఈ ట్రాక్టర్ల ఇంజన్ పవర్ కూడా అధికంగా ఉంటుందట. ట్రాక్టర్ ను కంపెనీ ఛార్జర్ తో మూడు గంటల్లో ఛార్జ్ చేయవచ్చని ధోండే అంటున్నారు. 2025 ఆర్థిక సంవర్సరానికి 100 ఈ ట్రాక్టర్లను మార్కెట్లోకి తీసుకురావాలని AutoNxt కంపెనీ ట్రై చేస్తోంది.

## బీజేపీ అధ్యక్షుడి కొడుకు కారు అర్ధరాత్రి చేసిన బీభత్సం ఇది.. వీడియో వైరల్..



**హైదరాబాద్ పెన్ పవర్:** మహారాష్ట్రలో బీజేపీ అధ్యక్షుడి కొడుకు ఆడి కారుతో బీభత్సం సృష్టించాడు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నాగ్‌పూర్ రోడ్లపై మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాన్‌కులే కుమారుడు సంకేత్ బవాన్‌కులే నానా రచ్చ చేశాడు. నాగ్‌పూర్‌లోని రాందాస్‌పేత్ ప్రాంతంలో సంకేత్ కారు పలు వాహనాలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి.

కారును ఢీ కొట్టి.. అంత బీభత్సం సృష్టించి అక్కడి నుంచి ఎస్కేప్ అయ్యేందుకు సంకేత్ ప్రయత్నించాడు. ఛేజ్ చేసి మరీ మంకాపూర్ బ్రిడ్జ్ దగ్గర సంకేత్ కారును అడ్డుకున్నారు. కారులో బీజేపీ అధ్యక్షుడి కుమారుడితో పాటు కారు డ్రైవర్ అర్జున్ హౌరే, రోణిత్ అనే మరో యువకుడు ఉన్నారు. ర్యాష్ డ్రైవింగ్ ఈ ఘటనకు కారణంగా పోలీసులు తేల్చారు. కారు నడిపింది ఎవరో స్పష్టత లేదు గానీ పోలీసులు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేయడం గమనార్హం.

బీజేపీ అధ్యక్షుడి కుమారుడిని ఈ కేసు నుంచి తప్పించేందుకే డ్రైవర్‌పై కేసు నమోదు చేశారని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి. ధరమ్‌పేత్‌లోని ఒక బార్ నుంచి ఈ ఆడి కారు తిరిగొస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనపై మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాన్‌కులే స్పందించారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, పోలీసులు నిష్పాక్షికంగా విచారణ జరపాలని చెప్పారు. తన కొడుకు తప్పు చేసినట్టు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాను ఈ ఘటనపై పోలీసులతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారు బీభత్సానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్‌కు సెంట్రల్ గవర్నమెంట్ అవార్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ గా పని చేస్తున్న డీజీ శిఖా గోయల్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డ్ లభించింది. సైబర్ క్రైమ్స్ అనాలసిస్ చేయడంలో వాటిని అడ్డుకోవడానికి ఆమె చేసిన కృషికి ఈ అవార్డ్ వచ్చింది. న్యూ ఢిల్లీ విజ్ఞాన్ భవన్ లో ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అవార్డు పొందారు ఆమె. కేంద్ర హోం మినిస్టర్ అమిత్ షా చేతుల మీదుగా డీజీ శిఖా గోయల్ అవార్డు అందుకున్నారు. సైబర్ క్రైమ్ అనాలసిస్, క్రిమినల్ నెట్ వర్క్ ను గుర్తించడం ద్వారా నేరాలపై విశ్లేషణ చేయడంలో శిఖా గోయల్ మంచి మార్క్ సంపాధించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా పాల్గొన్నారు.

## హైబీపీతో 5 నష్టాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రక్తపోటు అనేది మన గుండె ధమనుల గోడలపై కలిగే ఒత్తడి.. మన గుండె శరీరమంతా రక్తాన్నీ పంపింగ్ చేసేందుకు ధమనుల గోడలపైకి రక్తాన్ని ఒత్తిడితో నెడుతుంది. ఇది మన మొత్తం ఆరోగ్యానికి ముఖ్యమైన సూచన.

గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం.. రక్తపోటు ఎక్కువయితే రక్తనాళాలు, ధమనులను దెబ్బతీస్తుంది. ఇది గుండె, స్ట్రోక్ కు దారి తీసే అవకాశం ఉంటుంది.

**మెదడుకు నష్టం :** అధిక బ్లడ్ ప్రెషర్ గుండెతోపాటు.. మెదడును కూడా ప్రమాదంలో పడేస్తుంది. ఐబ్లడ్ ప్రెషర్ మెదడును అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది.

**హైపర్ టెన్సివ్ రెటినోపతి :** అధిక రక్తపోటు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతిస్తుంది. ఇది దృష్టిని కోల్పోయేలా చేస్తుంది.

**నరాలపై ప్రభావం:** హై బ్లడ్ ప్రెషర్ వల్ల మెదడుకు అంతే రక్తప్రవాహంలో అసమతుల్యతల కారణంగా నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. ఇది కంటిచూపు లోపాలకు దారి తీస్తుంది.

**లైంగిక సామర్థ్యంపై ప్రభావం :** అధిక రక్తపోటు పురుషులలో అంగస్థంభన, స్త్రీలలో లైంగిక కోరికను తగ్గించడంతో సహా లైంగిక బలహీనతలకు కారణమవుతుంది.

## మోడల్ విలేజ్... పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా మారనున్న రేవంత్ రెడ్డి స్వగ్రామం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పూర్తి సౌరశక్తితో నడిచే తొలి గ్రామంగా కొండారెడ్డిపల్లి రూపుదిద్దుకోనుంది. ఈ గ్రామం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం. 100 శాతం సౌరశక్తితో నడిచే ఆవాసాలకు నమూనాగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఈ గ్రామాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రక్రియను ప్రారంభించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారుల బృందం ఈ రోజు గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టింది. టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, రెడ్కో వీసీ, ఎండీ అనిల్, సంస్థ డైరెక్టర్ కే రాములు, ఇతర శాఖల ముఖ్య అధికారులు ఈరోజు కొండారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు మాట్లాడి, ఈ పైలట్ ప్రాజెక్టు వివరాలు తెలిపారు. ఈ గ్రామంలో దాదాపు 499 గృహ వినియోగదారులు, 66 వాణిజ్య వినియోగదారులు, 867 వ్యవసాయ వినియోగదారులు, ఇతర కేటగిరిలతో కలుపుకుని మొత్తం 1451 వినియోగదారులు ఉన్నారు. ఈ మోడల్ ప్రాజెక్ట్ అమలు చేసేందుకు నేడు ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ సర్వే ద్వారా గ్రామానికి అవసరమైన సౌర విద్యుత్ కెపాసిటీని అంచనా వేసి డీపీఆర్ తయారు చేసి, ఇతర ప్రక్రియలను ప్రారంభిస్తారు.

# భారత్ బలమైన జట్టే కాదనలేం.. మా ఆట చూస్తారు: బంగ్లా పేసర్





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్– బంగ్లాదేశ్ సిరీస్‌కు సమయం దగ్గర పడుతోంది. సెప్టెంబర్ 19 నుంచి ఈ ఇరు జట్ల మధ్య టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. సొంతగడ్డపై ఆడుతుండటం టీమిండియాకు కలిసొచ్చే అంశమైనప్పటికీ.. పాకిస్థాన్‌ను వారి గడ్డపైనే ఓడించిన బంగ్లా ఆటగాళ్లు ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. ఈ క్రమంలో భారత జట్టు గురించి.. భారత పర్యటన గురించి బంగ్లా వర్ధమాన పేసర్ నహిద్ రానా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

టీమిండియాను కఠిన ప్రత్యర్థిగా అంగీకరించిన నహిద్ రానా.. భారత జట్టును ఓడించగల సత్తా తమలో ఉందని చెప్పుకొచ్చాడు. ఈ పర్యటనలో తన దేశం కోసం ఏదైనా సాధించాలనుకుంటున్నట్లు వెల్లడించాడు.

**బాగా ఆడిన జట్టుదే విజయం**

“సహజంగానే మేము ఇండియా సిరీస్‌కు బాగా సన్నద్ధమయ్యాము. మంచి ప్రాక్టీస్ లభించింది. భారత పిచ్‌లపై అవహగాన ఉంది. అందుకు తగ్గట్టే సిద్ధమయ్యాం.. భారత్ మంచి జట్టే, కఠిన ప్రత్యర్థే కాదనలేం.. కానీ మంచి క్రికెట్ ఆడే జట్టు గెలుస్తుంది. మేము అక్కడికి వెళ్ళినప్పుడు చూద్దాం.. ఈ పర్యటనలో నా దేశం కోసం ఏదైనా సాధించాలనుకుంటున్నా.. అలా ఆశించిన దాన్ని అందించడం చాలా గొప్పగా అనిపిస్తుంది..” అని రానా బంగ్లాదేశ్ క్రికెట్ ‘ఎక్స్’లో పంచుకున్న వీడియోలో పేర్కొన్నాడు. నిలకడగా గంటకు 152 కి.మీ వేగంతో బంతులేయగల ఈ పేసర్.. ఇటీవల పాక్ పర్యటనలో అద్భుతంగా రాణించాడు. పదునైన పేస్‌కు తోడు పర్ఫెక్ట్ లెంగ్త్, బౌన్స్ అతని సొంతం. అందువల్లే ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నాడు.

**భారత్– బంగ్లాదేశ్ షెడ్యూల్**

మొదటి టెస్ట్: సెప్టెంబర్ 19–సెప్టెంబర్ 23(చెన్నై)

రెండో టెస్ట్: సెప్టెంబర్ 27–అక్టోబర్ 01(కాన్పూర్)

తొలి టీ20: అక్టోబర్ 06 (గ్వాలియర్)

రెండో టీ20: అక్టోబర్ 06 (ఢిల్లీ)

మూడో టీ20: అక్టోబర్ 06 (హైదరాబాద్)

**తొలి టెస్టుకు భారత జట్టు**

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, విరాట్ కోహ్లి , కెఎల్ రాహుల్ , సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), ఆర్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ , మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ , జస్ప్రీత్ బుమ్రా, యష్ దయాల్.

# గిల్ స్థానంలో అగర్వాల్‌కు పగ్గాలు.. రెండో రౌండ్‌లో కొత్త ముఖాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** సెప్టెంబర్ 12 నుంచి ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్లను ప్రకటించింది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు భారత జట్టులో చోటు దక్కించుకున్న భారత్ ఎ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కెఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్, ఆకాష్ దీప్ రెండో రౌండ్‌కు దూరమయ్యారు. అయితే, సర్ఫరాజ్ ఖాన్ ను యథావిధిగా కొనసాగించడం గమనార్హం.

**రింకూకు పిలుపు**

శుభ్‌మన్ గిల్ దూరమవ్వడంతో ఇండియా–ఏ కెప్టెన్‌గామయాంక్ అగర్వాల్ కు బాధ్యతలు అప్పగించారు. రైల్వేస్‌కు చెందిన ప్రథమ్ సింగ్, విదర్భకు చెందిన అక్షయ్ వాడ్కర్, ఆంధ్రాకు చెందిన షేక్ రషీద్ రెండో రౌండ్‌లో కొత్త ముఖాలు. టీ20 స్పెషలిస్ట్ రింకూ సింగ్ సైతం ఈ దేశవాళీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. మార్పులతో కూడిన ఇండియా–ఏ, బి, సి, డి జట్లను బీసీసీఐ మంగళవారం ప్రకటించింది.

ఇండియా ఏ: మయాంక్ అగర్వాల్ (కెప్టెన్), రియాన్ పరాగ్, తిలక్ వర్మ, శివమ్ దూబె, తనుష్ కొటియన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, అవేష్ ఖాన్, కుమార్ కుశాగ్రా, శాశ్వత్ రావత్, ప్రథమ్ సింగ్, అక్షయ్ వాడ్కర్, షేక్ రషీద్, షామ్స్ ములాని, అకిబ్ ఖాన్.

ఇండియా బి: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), సర్ఫరాజ్ ఖాన్, ముషీర్ ఖాన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, నవదీప్ సైని, ముకేశ్ కుమార్, రాహుల్ చాహర్, ఆర్ సాయి కిషోర్, మోహిత్ అవస్తీ , జగదీషన్, సుయాస్ ప్రభుదేశాయ్, రింకూ సింగ్, హిమాన్షు.

**ఇండియా సి:** రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటిదార్, అభిషేక్ పోరెల్, సూర్యకుమార్ యాదవ్, ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్ యాదవ్, వైషాక్ విజయ్‌కుమార్, అన్షుల్ ఖాంబోజ్, హిమాన్షు చౌహన్, మయాంక్ మార్కండే, ఆర్యన్, సందీప్ వారియర్.

**ఇండియా డి:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అథర్వ, యశ్ దూబె, దేవదత్ పడిక్కల్, రికీ భుయ్, సరాన్ష్ జైన్, అర్ష్‌దీప్ సింగ్, ఆదిత్య, హర్షిత్ రాణా, ఆకాష్ సేన్‌గుప్తా, కేస్ భరత్, సౌరభ్ కుమార్, సంజు శాంసన్, నిశాంత్ సిద్ధు, విద్వాత్ కవెరప్ప.

# బంగ్లాదేశ్‌తో టెస్టుకు అయ్యర్, షమీలను ఎందుకు పక్కనపెట్టారు? కారణాలు ఇవేనా...!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ – బంగ్లాదేశ్ జట్ల మధ్య సెప్టెంబర్ 19న చెన్నై వేదికగా మొదటి టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు బీసీసీఐ జట్టుని ప్రకటించింది. విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ వంటి స్టార్ ప్లేయర్లు తిరిగి టెస్ట్ జట్టులో అడుగుపెట్టారు. అంతేకాదు యువ బౌలర్ యశ్ దయాల్ కు కూడా సెలక్టర్లు చోటు ఇచ్చారు. అయితే తిరిగి జట్టులోకి వస్తాడని భావించిన స్టార్ మహ్మద్ షమీ, ఇటీవలే దులీప్ ట్రోఫీలో ఫామ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్‌లను సెలక్టర్లు విస్మరించారు. దీంతో మొదటి టెస్టుకు జట్టుని ప్రకటించిన నాటి నుంచి మహ్మద్ షమీ, అయ్యర్‌లను ఎంపిక చేయకపోవడంపై క్రికెటర్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మహ్మద్ షమీ గాయం నుంచి కోలుకున్నప్పటికీ ఫిట్‌నెస్ సాధించాల్సి ఉందని భావించవచ్చు. కానీ ఫామ్‌ను అందిపుచ్చుకున్న శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడానికి కారణాలు ఏమిటనే చర్చ నడుస్తోంది. అయితే వీరిద్దరినీ ఎంపిక చేయకపోవడానికి గల కారణాలను ప్రస్తావిస్తూ ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’ ఆసక్తికరమైన కథనాన్ని ప్రచురించింది. శ్రేయాస్ అయ్యర్ ఇటీవల ఫామ్‌లోకి వచ్చినప్పటికీ టెస్ట్ క్రికెట్‌లో అతడు నిలకడగా ప్రదర్శనలు చేయలేకపోతుండడం, 2024 సీజన్‌లో ప్రదర్శన పేలవంగా ఉండడం వంటి కారణాలతో సెలక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంది. ఫిట్‌నెస్ ఆందోళనలను కూడా లెక్కలోకి తీసుకున్నారని ప్రస్తావించింది. ఇక, గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ముంబయి జట్టుకి అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన బీసీసీఐ అతడిని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా సెలక్టర్లు పరిగణలోకి తీసుకున్నారని తెలుస్తోంది. మరోవైపు యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్, సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ వంటి మిడిలార్డర్ బ్యాటర్లు మంచి ఫామ్‌లో ఉండడం కూడా అయ్యర్ పేరును పరిగణనలోకి తీసుకోకపోవడానికి ఒక కారణమని సమాచారం. ఇక స్టార్ పేసర్ మహ్మద్ షమీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గాయం నుంచి కోలుకున్నప్పటికీ ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉన్నందున అతడిని పక్కన పెట్టినట్టు ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’ కథనం పేర్కొంది. అక్టోబర్ 11న ప్రారంభమయ్యే రంజీ ట్రోఫీలో బెంగాల్ తరపున ఆడి ఫిట్‌నెస్‌ను నిరూపించుకుంటే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా అతడిని జట్టులోకి తీసుకునే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, షమీ బంగ్లాదేశ్ సిరీస్‌కు తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉందని బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ గతంలో అన్న విషయం తెలిసిందే.

## మృణాల్ ఠాకూర్ యొక్క తాజా ఫ్యాషన్ ఎంపిక



# బిగ్ బాస్ లోకి బోల్డ్ బ్యూటీ.. బాల్ తో ఇప్పుడు అలా!



కన్నడ బ్యూటీ జ్యోతి రాయ్ తెలుగులో ఎలాంటి ఫ్యాన్ బేస్ దక్కించుకుందో అందరికీ తెలిసిందే. ఒకే ఒక్క సీరియల్ తో వేరే లెవెల్ లో క్రేజ్ సంపాదించుకుంది. గుప్పెడంత మనసు ధారావాహికలో యాక్ట్ చేసి అందరినీ మెప్పించింది. జగతి పాత్రలో అమ్మగా, టీచర్ గా కనిపించి మంచి మార్కులు కొట్టేసింది. సీరియల్ అంతా చీరల్లో ఎంతో పద్ధతిగా కనిపించి ఫిదా చేసింది. ఆ తర్వాత సినిమాలతో పాటు వెబ్ సిరీసుల్లో ఛాన్స్ అందుకుంది. దీంతో గుప్పెడంత సీరియల్ నుంచి బయటకు వచ్చేసింది అమ్మడు. అయితే సీరియల్ లో చీరల్లో పద్ధతిగా కనిపించిన జ్యోతి రాయ్.. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ ఉంటుంది. ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ ఫోటోలు పోస్ట్ చేస్తుంటుంది. పొట్టి డ్రెస్సులు, మోడ్రన్ ఔట్ ఫిట్స్ వేసుకుని పిక్స్ దిగుతూ సందడి చేస్తుంటుంది. గ్లామర్ డోస్ ఫుల్ గా పెంచేసి అలరిస్తుంటుంది. కుర్రాళ్ల మతులు పోగుడుతుంటుంది. %ూశ్రీంశీ =ఝు% – కేతిక శర్మ.. కిల్లర్ లుక్స్ కి ఫిదా అవ్వాల్సిందే తాజాగా కొత్త పిక్ షేర్ చేసింది జ్యోతి రాయ్. షార్ట్ జీన్ నిక్కర్, పొట్టి టాప్ తో క్లీవేజ్ షో చేసింది. థైస్ షోతో మైండ్ బ్లాక్ చేసింది. ఆమె బాడీపై ఉన్న టాటూను చూపిస్తూ మాయ చేసింది. తన షైనింగ్ స్కిన్ టోన్ తో అట్రాక్ట్ చేసింది. సింపుల్ మేకప్ తో ఫిదా చేసింది. పక్కన బాల్ పై హ్యాండ్ వేసి ట్రెండీగా కూర్చుని పోజు ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జ్యోతి రాయ్.. నయా పిక్ సూపర్ గా ఉందని కామెంట్లు పెడుతున్నారు. %ూశ్రీంశీ =ఝు% – గోట్ మూవీ తీసింది వారి కోసమే: డైరెక్టర్ అమ్మడు థైస్ షో, గ్లామర్ స్టన్నింగ్ గా ఉందని చెబుతున్నారు. లైకులు కొడుతూ.. పిక్ ను తెగ వైరల్ చేస్తున్నారు. అందానికి పర్యాయపదమంటూ కొనియాడుతున్నారు. అదే సమయంలో జ్యోతి రాయ్ కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అమ్మడు తెలుగు బిగ్ బాస్–8 సీజన్ లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇస్తుందని చెబుతున్నారు. అందుకు తగ్గ అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని అంటున్నారు. త్వరలోనే ఆమె హౌస్ లోకి వెళ్లనుందని కామెంట్లు పెడుతున్నారు. %ూశ్రీంశీ =ఝు% – పిల్లల్ని కనడానికి భయపడుతున్న తమన్నా అయితే సీజన్ స్టార్టింగ్ నుంచే ఆమె హౌస్ లోకి వెళ్లాల్సిందని.. కానీ కొన్ని కారణాల వల్ల వెళ్లలేదని చెబుతున్నారు. ఇప్పుడు వైల్డ్ కార్డ్ ఎంట్రీకి సిద్ధమవుతోందని అంటున్నారు. హీట్ పుట్టించే పిక్స్ తో నెట్టింట ఎప్పుడూ వైరల్ అయ్యే జ్యోతి రాయ్.. బిగ్ బాస్ హౌస్ లో ఎలాంటి సందడి చేస్తుందోనని కామెంట్లు పెడుతున్నారు. మరి జ్యోతి రాయ్ వైల్డ్ కార్డు ద్వారా బిగ్ బాస్ హౌస్ లోకి ఎప్పుడు ఎంట్రీ ఇస్తుందో.. ఎలా అలరిస్తుందో వేచి చూడాలి.

## షామా సికిందర్ స్టైల్ మిమ్మల్ని మరిన్నింటి కోసం తిరిగి వచ్చేలా చేస్తుంది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com